## క్లుప్తంగా

### అఖండ రామ భజన

ఒంగోలు మెట్రో: స్థానిక రాజీవ్ నగర్ బ్రాహ్మణ వయో వృద్ధాశ్రమం లో అయోధ్యలో బాల రాముని ప్రతిష్ట సందర్భంగా మంగళవారం ఉదయం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు అగస్త్యరాజు శివ.. బాల రాముని విశిష్టతను వివరించారు. కాలభైరవ ఉపాసకులు అఖండ రామ భజన, రామజపం చేస్తూ భక్తిని చాటుకున్నారు.

### డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ. 37.74 కోట్లు

కొత్తపట్నం: మండలంలో డ్వాక్రా గ్రూపుల మహిళకు నాలుగు విడతలుగా రూ. 37,74,7600 నగదును వారి అకౌంట్‌లో జమ చేసినట్లు ఏపీఎం షేక్ రజీయా సుల్తాన్ బేగం తెలిపారు. ఒక్కో ఏడాదికి 1,211 గ్రూపు గాను 12,035 సభ్యులకు రూ.9,43,5400 వారి అకౌంట్‌లో జమ చేశారు. అదేవిధంగా మంగళవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.9,43,5400 నగదును బటన్ నొక్కి అకౌంట్‌లో వేశామన్నారు. మాట చెప్పిన విధంగా మాట తప్పకుండా డ్వాక్రా గ్రూపు సభ్యులకు నగదు వేశారని డ్వాక్రా గ్రూపు సభ్యులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

### సహనంతో ఉండాలి



వర్తమానాన్ని అందిస్తున్న శామ్యూల్ పీటర్

ఒంగోలు రూరల్: ఒకరి ఎడల ఒకరు సహనం, ప్రేమతో ఉండాలని పాస్టర్ శామ్యూల్ పీటర్ మంగళవారం అన్నారు. గుంటూరు గవర్నింగ్ బాడీ బైబిల్‌మిషన్ మెంబర్ ప్రకాశం జిల్లా ఇన్‌చార్జ్ మాట్లాడుతూ పరులపట్ల, ఇతరుల పట్ల పూర్తి సహనం కలిగిన వ్యక్తి శాంతక్క అని అన్నారు. పాస్టర్ సుధాకర్ బాబు, కుమారి బేబీస్టార్, సి.హెచ్.విక్టర్‌పాల్, శేఖర్‌బాబు, పాస్టర్ ఇశ్రాయేల్, పాస్టర్లు యేబు, తిమోతి, సతీష్ పాల్గొన్నారు.

### కాలుష్య నివారణకు మొక్కల పెంపకం ఆవశ్యకం





మొక్కలను నాటుతున్న హైస్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు

చీమకుర్తి: కాలుష్యాన్ని నివారించటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ హైస్కూలు హెచ్‌ఎం వీ.సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి హైస్కూలు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌జీసీ కోఆర్డినేటర్ ఎన్. సుబ్బారావు మాట్లాడుతూ మొక్కల పెంపకం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

### పార్టీ అభ్యున్నతికి కృషి

ఒంగోలు సెంట్రల్: పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి కోరారు. ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం రామ్ నగర్, అన్నవరప్పాడు శ్రీలక్ష్మి, విజయ రావు, లత ఆధ్వర్యంలో పలువురు మహిళలు పార్టీలో చేరారు. పీఎం నరేంద్రమోదీ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాల నుంచి ప్రజలకు చక్కటి పాలన అందించారని, అయోధ్యలో బాల రాముని మందిరం నిర్మించి భారతీయుల కల నెరవేర్చారన్నారు. జిల్లా కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### పంట నమోదుకు ఈకేవైసీ తప్పనిసరి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

పెద్దారవీడు: రబీ సీజన్లో పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో కంభంపాడు, తంగిరాలపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులు సాగు చేసిన పంట నమోదుపై సూపర్ చెకింగ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ వేయాలని, ఇంకా ఏవరైనా పంట నమోదు చేయించుకుని ఈకేవైసీ వేయని వారు ఉంటే వెంటనే మీ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సహాయకుల వద్ద ఈకేవైసీ ఫిబ్రవరి 1వ తేదీలోపు వేయాలని సూచించారు.



బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రులు సురేష్, నాగార్జునలకు గజమాల వేస్తున్న మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డితో ఇతర నాయకులు



స్వాగతం పలకడానికి వచ్చిన నాయకులు, అభిమానులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలినేని



బాలినేనికి స్వాగతం పలికేందుకు బయలుదేరిన నాగులుప్పలపాడు మండల నాయకులు

# బాలినేనికి ఘన స్వాగతం

- జిల్లాలో ప్రతి సీటు గెలుచుకుందాం
- కార్యకర్తలకు నాయకులు అండగా నిలబడాలని సూచన

మద్దిపాడు: జిల్లా ముఖ ద్వారం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం లభించింది. మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి పూల బొకేలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద పార్టీ నాయకుడు లింగా రామకృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన వేదికపై సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాయకులు పలువురు ఆయనకు పూల మాలలు వేసి శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. అనంతరం మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి బాలినేని శ్రీనివాసరెడ్డికి, మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్‌కు గజమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం బాలినేని గ్రోత్ సెంటర్ ముఖ ద్వారంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిసీటును వైఎస్ఆర్ సీపీ గెలిచేలా నాయకులంతా కృషి చేయాలని, అందుకు కార్యకర్తలే ముఖ్యమైన బలం అన్నారు. కార్యకర్తలకు నాయకులు అండగా నిలిచి వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రతి సీటు గెలిచి ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామని చెప్పారు. త్వరలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలకు ముందుకు వెళ్లేందుకు ప్రణాళిక వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి మండవ అప్పారావు, పోలవరపు శ్రీమన్నారాయణ, ఎంపీపీలు వాకా అరుణ కోటిరెడ్డి, నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, తేళ్ల భాగ్యలక్ష్మి పుల్లారావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.



కొత్తపట్నం మండలం నుంచి ర్యాలీ..

**భారీగా తరలిన కార్యకర్తలు**

నాగులుప్పలపాడు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కలిసి ఒంగోలులో ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించుకొని మంగళవారం ఒంగోలుకు వచ్చిన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేశారు. క్రమంలో నాగులుప్పలపాడు మండలం నుంచి పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా కార్ల ర్యాలీతో వెళ్లి తమ అభిమాన నాయకుడికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పల్లెర్ల అంజిరెడ్డి, ఇస్తర్ల అంజయ్య, మున్నంగి వెంకట్రావు, మద్దిసాని నాగేశ్వరరావు, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

**భారీగా తరలి వెళ్లిన కార్యకర్తలు**

కొత్తపట్నం: నియోజక వర్గంలో అర్హులైన ఇళ్ల స్థలాలు ఇవ్వటానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన కృషి సందర్భంగా మంగళవారం నగరంలో భారీ ర్యాలీ కోసం తరలి వెళ్లారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈతముక్కల, మడనూరు, కొత్తపట్నం, మడనూరు, అల్లూరు, పాదర్తి, ఆలూరు, గాదెపాలెం, కె.పల్లెపాలెం, రాజుపాలెం, రంగాయపాలెం, గుండమాల, మోటుమాల, వజ్జిరెడ్డిపాలెం, సంకువారిగుంట గ్రామాల్లో బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. బైకలకు జెండాలు కట్టుకుని వెళ్లారు.

# రోగులకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

మద్దిపాడు: దీర్ఘకాలిక రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరమని సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని అన్నంగి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా దీర్ఘకాలిక జబ్బులకు స్పెషలిస్టు డాక్టర్లు హాజరు కావడం, అవసరమైతే రోగులకు పూర్తి ఉచితంగా ఆపరేషన్లు వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీద్వారా చేయించడం వలన పేదలకు రూపాయి లేకుండా కార్పొరేట్ వైద్యం అందుతుందని అన్నారు. క్యాంపులో స్పెషలిస్టు డాక్టర్‌లు డాక్టర్ అంజనేయులు, గైనకాలజిస్ సుస్మిత పాల్గొనగా ఆస్పత్రి డాక్టర్‌లు ఆనందమోహన్, శ్రావణ్, జగదీష్ ఎంపీటీసీ రాయపాటి సుజాత, గ్రామ పెద్దలు తేళ్ల పుల్లారావు, పల్లపాటి అన్వేష్, వైద్యశాఖ సిబ్బంది, సచివాలయ కార్యదర్శి అనూష, కార్యాలయ సిబ్బంది, వలంటీర్లు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.





మోటుమాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైష్ణవి



అన్నంగిలో మందులు అందిస్తున్న సర్పంచ్ లోకేశ్వరి, ఎంపీటీసీ, డాక్టర్ ఆనంద మోహన్

**అందరూ ఆరోగ్యంగా జీవించాలి**

మోటుమాల (కొత్తపట్నం): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టిందని సర్పంచ్ కోడూరి గోపి అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ వైష్ణవి ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఓపీ విభాగం, మందులు పంపిణీ, వైద్య పరీక్షలు, బీపీ, ఈసీజీ అన్ని ఏర్పాట్లు చేశారు. 269 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గోపి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రజలు హాస్పిటల్‌కు పోవడానికి అశ్రద్ధ చేస్తారని మన గ్రామానికే వచ్చి వైద్య పరీక్షలు చేయటం అభినందనీయమన్నారు. దీర్ఘకాలిక వ్యాధులుంటే కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళ్లి వైద్యం చేసుకోవడానికి ఇది మంచి అవకాశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తాయన్నారు. ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య డాక్టర్ శివపార్వతి గర్భిణులకు పరీక్షలు చేసి వారికి ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ స్వప్న స్కూల్ విద్యార్థులకు పరీక్షలు చేసి ఆరోగ్య అలవాట్లు, మంచి ఆహారం తీసుకోవాలని, సలహాలు ఇచ్చారు. తదుపరి గోపి కళజోళ్లు పంపిణీ చేశారు. సీహెచ్‌వో ఓంకార్, హెల్త్ సూపర్ వైజర్ సులోచన, ప్రభాకర్, పీహెచ్‌ఎస్ ఇందిరాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ(సీహెచ్‌వో) అమరుల్లా పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు

ఒంగోలు: స్థానిక కేంద్రీయ విద్యాలయలో పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా సీబీఎస్ఈ పాఠశాలలకు సంబంధించి చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఈ పోటీలకు కందుకూరు కేంద్రీయ విద్యాలయం, రాజంపల్లి కేంద్రీయ విద్యాలయం, ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి, మార్కాపురం జవహర్ నవోదయ విద్యాలయ సమితి, ఒంగోలు కృష్ణా మెమోరియల్ స్కూలు విద్యార్థులు 51 మంది పాల్గొని సత్తాచాటారు. వికసిత భారత్, ఎగ్జామ్ మంత్రాస్, చంద్రయాన్, స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా మొదలైన అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న ఒత్తిడిని, భయాన్ని పోగొట్టేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఒంగోలు కేంద్రీయ విద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ సూర్యప్రకాశరావు

## 108 ఈఎంటీకి ఆర్థిక సహాయం

కొత్తపట్నం: కొండెపి రూట్‌లో 108లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషన్‌గా పనిచేస్తున్న నోవాహ విధులు నిర్వహిస్తుండగా కుడి చేయి విరిగింది. రెండు నెలలు పాటు ఇంటి దగ్గరే ఉన్నాడు. రెండు నెలలు పాటు జీతం లేకపోవడంతో కుటుంబం గడవటం కష్టంగా మారింది. దీంతో 108 ఒంగోలు డివిజన్‌లో పనిచేసే సిబ్బంది అంతా కలిసి రూ.5 వేలు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ చేతులతో ఆదివారం పాత రిమ్స్ హాస్పిటల్ అవరణలో అందించారు. కష్టకాలంలో ఇచ్చిన రూ.5 వేలు ఎంతో ఉపయోగపడతాయని 108 సిబ్బందికి నోవాహ కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం జిల్లా యూనియన్ అధ్యక్షుడు దర్గా మస్తాన్, 108 ఒంగోలు డివిజన్ అధ్యక్షుడు మెడికొండ దాసు దినేష్, డివిజన్ ట్రెజరీ బత్తిన భాస్కర్, గంగాధర్, వై.వెంకటేవ్వర్లు, కొత్తపల్లి నాగరాజు పాల్గొన్నారు.





నోవాహకు రూ.5 వేలు నగదును అందజేస్తున్న మహేష్, 108 సిబ్బంది

## సృజనాత్మక రచన గ్రంథావిష్కరణ

ఒంగోలు మెట్రో: డిగ్రీ ప్రథమ సంవత్సరం సెమిస్టర్ 2 పేరిట ఏర్పాటు చేసిన సృజనాత్మక రచన గ్రంథాన్ని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డా.నాగభైరవ ఆదినారాయణ ఒంగోలులోని వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠ్య గ్రంథంలో విద్యార్థులకు ఉపయోగపడే వ్యక్తీకరణ నైపుణ్యాలను, అనువాద రచనలను, మాధ్యమాలకు సంబంధించిన వివరాలను, వ్యాసరచనను, తెలుగు సాంకేతికత మొదలగు అంశాలను పాఠ్యాంశాలుగా పరిచయం చేయడం చాలా బాగుందని తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు డిగ్రీ రెండో సెమిస్టర్లో నూతనంగా తయారు చేసిన ఈ సృజనాత్మక రచన అనే పాఠ్య గ్రంథం విద్యార్థులకు ఉపయోగపడుతుందని, ఉద్యోగం రాకపోయినా స్వయం ఉపాధి పొందే మార్గాలను ఈ పుస్తకం లో చేర్చడం సముచితం గా ఉందని డాక్టర్ నూనె అంకమ్మరావు అన్నారు. కార్యక్రమంలో బి. శ్రీరామశర్మ, హరివరం మహేశ్వరాచారి, కనుమళ్ళ, శేషగిరిరావు పాల్గొన్నారు.



పుస్తక ఆవిష్కరణలో నాగ భైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు

## అంగన్‌వాడీల అభినందన సభ



అభినందన సభలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు సిటీ: అంగన్‌వాడీ వర్కర్స్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విజయోత్సవ అభినందన సభ, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హేమోము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. డిమాండ్ల పరిష్కారానికి రెండు మూడు రోజుల్లో జీఓ ఇస్తారని, ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచుతామని, పదోన్నతులు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సీనియర్ నాయకులుడు ఎస్‌డీ సర్దార్, ఐఎంటీయూ రాష్ట్ర నాయకుడు సాయినాథ్ టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉంగర శ్రీనివాసరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు నాగసాయి లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, రమాదేవి, వినోద్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.కల్పన, కోశాధికారి సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో మేలు



ప్రకృతి వ్యవసాయ పంటను పరిశీలిస్తున్న ఏఓ



కొండాయపాలెంలో కంది పంటను పరిశీలిస్తున్న ఏవో

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు తమ పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని తూర్పుగంగవరంలో మంగళవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. వివిధ రకాల జాతులకు చెందిన 26 రకాల పంటలను 20 సెంట్లలో పండిస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. ఆశక్తి ఉన్న రైతులు తమ ఇంటి ఆవరణలో నిత్యవసర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. అందుకు సంబంధించిన సలహాలు, సూచనలు ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ నరసింహులు ఇస్తారని చెప్పారు. ఐసీఆర్‌పీలు అనంతలక్ష్మి, ఉమాదేవి, రైతు గూడా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**కంది పంట పరిశీలన**

పొదిలి రూరల్: మండలంలోని కొండాయపాలెం, మాదాలవారిపాలెం గ్రామాల్లో సాగు చేస్తున్న కంది పంటను మంగళవారం వ్యవసాయాధికారి ఎస్‌కే జైన్‌లాబ్దిన్ పరిశీలించారు. మారుకా మచ్చ పురుగు ఎక్కువ కాలం గూడులో ఉండటం వలన అదుపుచేయడం కష్టంగా ఉంటుందన్నారు. దీని నివారణకు పిందె దశలో 5 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేయాలన్నారు.

## బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు



కొత్తపట్నంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు సిటీ: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి అన్నారు. మంగళవారం ఒంగోలు కేంద్ర జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 144వ జయంతి నిర్వహించారు. అనంతరం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది సంపూర్ణమ్మ, శాంసన్, కృష్ణవేణి, అనిల్ బాబు, శివకుమారి, మృదుల్‌కుమార్, స్మైలీ పాల్గొన్నారు.

కొత్తపట్నం: స్వాతంత్ర్య సమరయోధుడు, ధైర్యశాలి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి కొనియాడారు. మంగళవారం గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు గీసిన సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ బోస్ ధైర్య సాహసాలు గురించి విద్యార్థులకు వివరించారు. శ్రీనివాస్, పత్రి వెంకట్రావు, శరత్ చంద్ర, నాగమల్లేశ్వరరావు, కృష్ణమూర్తి, శేషగిరి, శేషారావు, మధు, వసుంధర, వాసంతి, ధనలక్ష్మి, ధన జ్యోతి, షకీలా, ఉష, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తిని కొనసాగించాలి

- ఏపీ ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్య సంఘం డిమాండ్





నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఏపీ ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్య సంఘం నాయకులు

ఒంగోలు: యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తిని కొనసాగించాలని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.గుండాలరెడ్డి కోరారు. బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులను ఇంజినీరింగ్ కాలేజీల్లో విలీనం చేస్తూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిర్ణయం సరైంది కాదన్నారు. అనంతరం వీసీ అంజిరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి. సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం ఏకేయూ అసోసియేషన్ బాడీ ఎంపిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా బి.సూర్యనారాయణ, అధ్యక్షులుగా ఎం.రాంబాబు, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా వై.పెద్దిరాజు, సంయుక్త కార్యదర్శిగా కదిరి రంగారావు, కోశాధికారిగా సీహెచ్ రాంభూపాల్‌రెడ్డి, ఈసీ సభ్యులుగా వెంకటేశ్వర్లు తదితరులను ఎన్నుకున్నారు.

## వృద్ధాశ్రమానికి సామగ్రి అందజేత

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమానికి రోషాగ్ని సినిమా హీరో రాజావీరరాజు మంగళవారం 10 లీటర్ల రైస్ కుక్కర్, ఇతర సామగ్రిని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కుక్కర్లు అందజేస్తున్న హీరో రాజువీరరాజు